న్యాయమూర్తులకు చట్టాలపై వర్క్‌షాప్

ఏలూరు అర్బన్ : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ అధ్యక్షతన శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు ఏలూరు కోర్టు ప్రాంగణంలో వివిధ చట్టాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపై మరింత నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఇటువంటి వర్క్ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.శ్యాంసుందర్ మాట్లాడుతూ చట్టాల్లో వస్తున్న మార్పులను అధ్యయనం చేయటానికి వర్క్ షాపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. న్యాయమూర్తులు ఉత్తమమైన సేవలందించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. రిటైర్డ్ జిల్లా జడ్జి జి.వి.కృష్ణయ్య, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది జంపన శ్రీదేవి, రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

పిహెచ్‌సి డాక్టర్లపై.. జిఒ 85 కత్తి..!

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు ఎదురుదెబ్బ

సర్వీస్ కోటాలో పీజీ సీట్లు 15 శాతానికి కుదింపు

ఐదు బ్రాంచ్‌లకే పరిమితం చేయడం మరో దారుణం

పిహెచ్‌సి డాక్టర్ల పీజీ ఆశలకు గండి

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత ఏర్పడే ప్రమాదం

ప్రభుత్వం పునరాలోచించాలని వైద్యుల నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పిహెచ్‌సి (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) డాక్టర్ల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులపై కక్ష కట్టినట్లు ముందుకు సాగుతోంది. పేదలకు వైద్య సేవలందించే వైద్యులపై అత్యంత కాఠిన్యం ప్రదర్శిస్తోంది. పిహెచ్‌సి వైద్యులకు సర్వీస్ కోటాలో దక్కాల్సిన పీజీ సీట్లను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 85 వైద్యుల మెడపై కత్తిగా మారింది. పిహెచ్‌సి వైద్యుల పీజీ చదువుల ఆశలను ప్రభుత్వం చిదిమేసే పరిస్థితి నెలకొంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలపై తీవ్ర ప్రభావం పొంచి ఉంది. జిఒను రద్దు చేసి అన్ని వైద్యకోర్సుల బ్రాంచ్‌ల్లోనూ తమకు ఇస్తున్న కోటాను పునరుద్ధరించాలని పిహెచ్‌సి వైద్యులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఏలూరు డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పిహెచ్‌సి వైద్యులు

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పేదలకు అందే వైద్యసేవలకు ఇబ్బందులు సృష్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే పిహెచ్‌సి వైద్యులకు మరిన్ని సదుపాయాలు, అవకాశాలు కల్పించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వం తెచ్చిన జిఒ 85నే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. ఏలూరు జిల్లాలో 62 పిహెచ్‌సిలు ఉండగా 130 మంది వైద్యులు ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 41 పిహెచ్‌సిలు ఉండగా 110 మంది వరకూ వైద్యులు సేవలందిస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పేదలకు వైద్యసేవలు అందించడంలో పిహెచ్‌సి వైద్యులదే కీలక పాత్ర. నిరుపేదలకు పిహెచ్‌సిలు ఎంతగానో వైద్యసేవలు అందిస్తున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో గతంలో ప్రభుత్వాలు కొన్ని అవకాశాలను కల్పించాయి. గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు పని చేసిన పిహెచ్‌సి వైద్యులు పీజీ విద్యను అభ్యసించేందుకు నీట్ పరీక్ష రాస్తే వీరికి అన్ని వైద్యకోర్సుల బ్రాంచ్‌ల్లోనూ సర్వీస్ కోటా కింద 30 శాతం సీట్లు ఇచ్చేవిధంగా అవకాశం కల్పించారు. చాలాకాలంగా ఈ సర్వీస్ కోటా కొనసాగుతోంది. ప్రభుత్వం ఈ ఏడాది జులై 20న జిఒ 85 తీసుకొచ్చింది. ఈ జిఒ ప్రకారం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు లభించే సర్వీస్ కోటా సీట్లను 15 శాతానికి కుదించారు. ఆ సీట్ల సంఖ్యను కూడా అన్ని వైద్య కోర్సుల బ్రాంచ్‌లకు కాకుండా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజిస్ట్, పిడియాట్రిక్స్, అనస్థియా వంటి ఐదు బ్రాంచ్‌లకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు జిఒలో పేర్కొన్నారు. రేడియాలజిస్ట్, డెర్మటాలజిస్ట్ వంటి ఇతర బ్రాంచ్‌లకు వర్తించకుండా చేసింది. పిహెచ్‌సిల్లో పని చేసే వైద్యులకు ఇది మెడపై కత్తిగా మారింది. సీట్లు తగ్గిపోవడంతో ఎంతోమంది వైద్యులు గవర్నమెంట్ కాలేజీలో సీట్లు దక్కించుకోలేని దుస్థితి ఏర్పడనుంది. గతంలో కొనసాగించిన 30 శాతం సీట్లను అన్ని బ్రాంచ్‌లకు అమలు చేయాలని గడిచిన 11 రోజులుగా విధులను బహిష్కరించి వైద్యులు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా ముందుకు సాగుతోంది. దీంతో వైద్యులు లేక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కుంటుపడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే పిహెచ్‌సి వైద్యుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ వైద్యసేవలకు జిఒ 85 ప్రమాదం

ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ వైద్యం అత్యంత వేగంగా విస్తరిస్తోంది. వైద్య విద్యను అభ్యసించిన వారు పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేసేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసేందుకు వెనుకాడుతున్నారు. పిహెచ్‌సి డాక్టర్లకు పీజీ సీట్లలో సర్వీస్ కోటా ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు మరింత మెరుగుపడుతున్న పరిస్థితి నెలకొంది. సర్వీస్ కోటాను తగ్గిస్తే యువ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పని చేసేందుకు విముఖత చూపే పరిస్థితి ఏర్పడనుంది. అదే జరిగితే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం కుంటుపడే ప్రమాదం ఏర్పడనుంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే పిహెచ్‌సి వైద్యుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని అంతా కోరుతున్నారు.

వైద్యుల నిరసనలపై నిర్బంధం..

జిఒ 85 వెనక్కి తీసుకోవాలంటూ పిహెచ్‌సి వైద్యులు చేపట్టిన నిరసనలపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తోంది. నిరసనలకు అధికారులు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద నిరసనలు చేయకుండా అడ్డుపడుతున్న పరిస్థితి ఉంది. దీనిపై పిహెచ్‌సి వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనకు అనుమతులు లేవంటూ శనివారం డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పిహెచ్‌సి వైద్యులు అంతా అక్కడికి చేరుకుని అలా ఉండిపోవాల్సి వచ్చింది. తర్వాత జిఒ 85కు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకూ నిరసనలు ఆపేది లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

పూర్వపు పద్ధతి కొనసాగించాలి..

పూర్ణచంద్రకుమార్, ఎపి పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్, జనరల్ సెక్రటరీ, ఏలూరు



ఇప్పటి వరకూ కొనసాగించిన విధంగానే సర్వీస్ కోటాలో పిహెచ్‌సి వైద్యులకు 30 శాతం సీట్లు ఇవ్వాలి. ఐదు బ్రాంచ్‌లకు పరిమితం చేయకుండా అన్ని క్లినికల్ బ్రాంచ్‌లకు వర్తింపజేయాలి. జిఒ 85ను వెనక్కి తీసుకోవాలి. గ్రామీణ వైద్యం మెరుగుపడేలా ప్రభుత్వం ముందుకు సాగాలి.

జిఒ 85 అమలైతే ప్రభుత్వ కళాశాలల్లో సీటు కష్టం

డాక్టర్ కళ్యాణి మహేశ్వరి, పిహెచ్‌సి, పూళ్ల

గడిచిన మూడున్నరేళ్లుగా పూళ్ల పిహెచ్‌సిలో డాక్టర్‌గా పని చేస్తున్నాను. 2024 ఆగస్టులో నీట్ పరీక్ష రాశాను. పరీక్ష క్వాలిఫై అయ్యాను. ప్రభుత్వం జిఒ 85 తెచ్చి 30 శాతం సీట్లను 15 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ కళాశాలలో సీటు రాకుండా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. జిఒను వెంటనే ఉపసంహరించుకుని పిహెచ్‌సి వైద్యులకు న్యాయం చేయాలి.

సీట్ల కుదింపుతో పీజీ అవకాశాలకు దెబ్బ

డాక్టర్ శ్రీలక్ష్మి, పిహెచ్‌సి, గుండుగొలను

ఈ ఏడాది నీట్ పరీక్ష రాశాం. ప్రభుత్వం సర్వీస్ కోటా సీట్లను 15 శాతానికి కుదించడంతో నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. సీట్ల కుదింపుతో పీజీ చదివే అవకాశాలను పిహెచ్‌సి వైద్యులు కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది. ప్రభుత్వ కాలేజీలో సీట్లు దక్కే అవకాశం ఉండదు. వెంటనే జిఒ 85ను నిలుపుదల చేయాలి.

ఆదర్శ నియోజకవర్గంగా నూజివీడు

సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



విరాళం అందించిన మహిళలను అభినందిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. స్థానిక ఎంఆర్.అప్పారావు కాలనీలో తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి శనివారం మంత్రి ఆయన శంకుస్థాపన చేశారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంపై ముద్రించిన స్టిక్కర్‌ను ప్రజల ఇళ్లకు వెళ్లి అంటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి, వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పాలేరును అవుతానని, ఎన్నికలకు ముందు మీకు ఇచ్చిన మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని తెలిపారు. నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రానికే మోడల్ నియోజకవర్గంగా నిలబెడతానన్నారు. నూజివీడు పట్టణమంతా ఒకే విధమైన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు టెండర్లు పిలిచామని, నెలరోజుల్లోగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నూజివీడులో ఎంఆర్.అప్పారావు కాలనీ అతిపెద్ద కాలనీ అని, కాలనీ అభివృద్ధికి అవసరమైన తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఆర్.అప్పారావు కాలనీలోని 24 రోడ్లలో పది రోడ్లలో పైపులైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని, మిగిలిన రోడ్లలో కూడా పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. కాలనీ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని, ఆర్‌టిసి బస్ సర్వీస్ ఏర్పాటు చేస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కాలనీలో ఆసుపత్రి నిర్మాణ పనులు నెలలోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి, డిఇ లక్ష్మీనారాయణ, ప్రముఖులు బర్మా ఫణిబాబు, కాపా శ్రీనివాసరావు, తలపంటి రాజశేఖర్, చెరుకూరి దుర్గాప్రసాద్, మున్సిపల్ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 వేల చెక్కును మంత్రి పార్థసారథికి అందించారు. ఈ సందర్భంగా విపత్తు సమయంలో మానవత్వంతో స్పందించి విరాళం అందజేసిన మహిళలను మంత్రి అభినందించారు.

రూ.4 కోట్లతో చెరువు గట్ల మరమ్మతులు

ఇటీవల భారీవర్షాలు, వరదల కారణంగా నూజివీడు నియోజకవర్గంలో దెబ్బతిన్న చెరువు గట్ల మరమ్మతు పనులకు రూ.నాలుగు కోట్లు మంజూరు చేశామని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడులో ఇటీవల వరదల కారణంగా గండి పడిన పెద్దచెరువు గట్టు మరమ్మతు పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నూజివీడులో పలు చెరువులకు గండ్లు పడి ప్రజలు ఎన్నో కష్టాలు పడటంతోపాటు పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. చెరువుల గట్లపై ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. నియోజకవర్గంలో చెరువులకు గండ్లు పడి రూ.22 కోట్లు మేర నష్టం జరిగిందన్నారు. గండ్ల కారణంగా ఆయా చెరువుల్లో నీటిని నిల్వ చేసే అవకాశం లేదని, దాంతో ప్రస్తుతం, రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. అందుకే గండ్లు పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు వివరించారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల టిడ్కో ఇళ్ల లబ్దిదారులు బ్యాంకర్ల ముందు దోషులుగా నిలబడ్డారని మంత్రి పార్థసారథి అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాక, రుణాలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 8వ వార్డులో రూ.11.15 లక్షలతో నిర్మించనున్న డ్రెయిన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం డిఎఆర్ కాలేజీ వద్ద రూ.14.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

24న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్ల ముసాయిదా

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు : శాసనమండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా ముసాయిదా ఈ నెల 24న విడుదల చేస్తారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో శనివారం ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్‌పై అభ్యంతరాలు దాఖలు చేసేందుకు ఈ నెల 24 నుంచి అక్టోబరు 15 వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబరు 30 నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామన్నారు. జిల్లాలో కొత్తగా 2331 మంది క్లెయిమ్స్ అందజేయగా వాటిని పరిశీలించిన పిమ్మట 2271 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 20 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించడంలో భాగంగా ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, రాజకీయ పక్షాల ప్రతినిధులు రాజనాల రామ్మోహన్‌రావు, రంభ కిషోర్ (కాంగ్రెస్), నెరుసు నెలరాజు (బిజెపి), బి.రత్నబాబు (బిఎస్‌పి), ఎ.రవి, డిఎన్‌విడి.ప్రసాద్ (సిపిఎం), ఎస్.అచ్యుతబాబు, యు.బాలానందం (టిడిపి), ఎన్.కాశీనరేష్ (జనసేన) పాల్గొన్నారు.

అందరూ గర్వించదగిన గేయం రచించిన గురజాడ

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు

ఘనంగా గురజాడ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు

గురజాడ అప్పారావు తెలుగువారంతా గర్వించదగిన గొప్ప దేశభక్తి గేయం రచించారని, నేటి విద్యార్థులందరూ దానిని నిరంతరం చెప్పగలిగేలా నేర్చుకోవాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయ హైస్కూలులో శనివారం నిర్వహించిన మహనీయుల ఆశయాల బాటలో నవ చైతన్యం కార్యక్రమంలో భాగంగా గురజాడ విగ్రహానికి నవ చైతన్యం కన్వీనర్ పి.ఆంజనేయులు నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.తిరుపతిరావు బృందం, హైస్కూలు టీచర్లు 600 మంది విద్యార్థులు గురజాడ అప్పారావుకు జోహార్లు చెప్పారు. అనంతరం సంగీతం టీచర్ జి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులంతా దేశమును ప్రేమించుమన్నా గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, నవ చైతన్యం కార్యక్రమం కన్వీనర్ పి.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశమైనా తమ భాషలోకి మార్చుకొని జాతీయగీతంగా పెట్టుకోగలిగిన అర్హత గురజాడ రాసిన దేశమును ప్రేమించుమన్నా గేయానికి ఉందని మహాకవి శ్రీశ్రీ చెప్పారన్నారు. విద్యార్థులంతా ఈ గేయాన్ని దాని భావాన్ని తెలుసుకోవాలని, అందుకు టీచర్లు ప్రయత్నించాలని చెప్పారు. ప్రతి విద్యార్థి దేశమును ప్రేమించుమన్నా గేయం పాడగలిగేలా టీచర్లు ప్రోత్సహించాలని, నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం నుంచి 29వ తేదీ వరకు అడవి బాపిరాజు వర్ధంతి, ఎస్‌పి బాలసుబ్రమణ్యం వర్ధంతి, రాజా రామ్మోహన్‌రాయ్ వర్ధంతి, భగత్‌సింగ్ జయంతి, గుర్రం జాషువా జయంతి, జ్యోతిరావు పూలే దంపతులు సత్యశోధన పురస్కరించుకుని హైస్కూలు, కాలేజీ విద్యార్థులు గాయకుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమాలను అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పి.ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీల ఆధ్వర్యంలో వేలాదిమంది విద్యార్థులతో 150 స్కూల్స్‌లో గురజాడ జయంతి కార్యక్రమాలకు సన్నాహం చేశామన్నారు. శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్ ఉపాధ్యాయులు ఇ.గోపాల్, ఎ.జోజిబాబు, ఎఎస్ఆర్.మూర్తి, జి.శిరీష, శ్యామల, రమ్య ఆధ్వర్యం వహించారు.

గురజాడ జయంతి వేడుకలో వక్తలు, విద్యార్థులు

గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్‌లో జరిగిన సభలో బి.సోమయ్య, ఎఆర్‌డిజికె హై స్కూలులో గంగాభవాని, హనుమాన్ జంక్షన్ మానవత కార్యాలయంలో ఎం.కోటేశ్వరరావు, శర్వాణి పబ్లిక్ స్కూలులో వై.నిర్మల, కె.జనని, బాలికల హైస్కూలులో మేతర అజయ్ బాబు, ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎం.అజయ్‌బాబు, ఎం.అశోక్ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం తరపున పాల్గొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించారు.

గాంధీనగర్‌లో ఉన్న గురజాడ చౌక్ వద్ద గురజాడ విగ్రహానికి నవ చైతన్యం కమిటీ కన్వీనర్ కూచిపూడి సత్యనారాయణ, స్కూల్స్ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీనగర్‌హై స్కూల్, శర్వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కన్వీనర్ పి.ఆంజనేయులు, ఎవిఆర్.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మేతర అజయ్‌బాబు మాట్లాడారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సంఘ సంస్కరణకు, సాహిత్య సంస్కరణకు గురజాడ తన రచనల ద్వారా అడుగు జాడలు ఏర్పరచారని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథి దేవరకొండ వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథి డాక్టర్ పెరియార్ మాట్లాడారు. తెలుగు విభాగం అధ్యాపకులు ఎస్.పరమేశ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

సర్ సిఆర్ రెడ్డి కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కెవి.రామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ హాజరయ్యారు. ప్రధాన వక్తగా తెలుగు శాఖాధిపతి మేడసాని శ్రీనివాసరావు విచ్చేశారు.

బుట్టాయగూడెంలో భారీ వర్షం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రమైన బుట్టాయగూడెం మండల కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వం జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో నీరు చేరింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది అధికారులు వచ్చినా ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థుల అవస్థలను ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గహంలో వాడిన నీరు బయటకు పోయే విధంగా డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలని, వర్షపు నీరు బయటకు వెళ్లేవిధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వర్షపు నీటిలో విద్యార్థినుల ఇబ్బందులు

మడమ తిప్పుతున్నారు..!



'మేం మాట తప్పం.. మడమ తిప్పం..' వైసిపి నేతలు గతంలో తరచూ మాట్లాడే మాట ఇది. అయితే అధికారం దూరం కావడం, ఆరోపణలు వరుసగా చుట్టుముడుతుండటంతో రెండు జిల్లాల్లోని ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు మడమ తిప్పుతున్నారు. అదే సమయంలో టిడిపి, జనసేన నేతలు వారిని అక్కున చేర్చుకునేందుకు పోటీ పడుతుండడం గమనార్హం.

జిల్లా కేంద్రమైన ఏలూరులో వరుస రాజీనామాలతో కకావికలమైన ప్రతిపక్ష వైసిపి తాజాగా పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే సమస్య ఎదుర్కొంటుంది. ఏలూరులో మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీకి గుడ్‌బై చెప్పాక మేయర్, కార్పొరేటర్లు, ఇడా ఛైర్‌పర్సన్ వరకూ అంతా టిడిపి గూటికి క్యూ కట్టిన సంగతి తెలిసిందే. తాజాగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతుల వ్యవహారం టిడిపి, జనసేన నడుమ దూరం పెంచిందనే చెప్పొచ్చు. జనసేనలో చేరుతున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు ప్రకటించాక టిడిపి నేతలు గుట్టుగా వ్యవహారం సాగించి వారిని టిడిపిలో చేర్చుకున్నారు. దీంతో జనసేన నేతలు చేర్పింపుల్లో దూకుడుగా వ్యవహరించేందుకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే పక్కచూపులు చూస్తున్న వైసిపి మాజీ ఎంఎల్‌ఎలు, ఇతర ప్రజాప్రతినిధులతో అటు టిడిపి, ఇటు జనసేన నేతలు పోటాపోటీగా మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మాజీ ఎంఎల్‌సి, మాజీ జెడ్‌పి ఛైర్మన్ మేకా శేషుబాబుపై వైసిపి అధిష్టానం వేటు వేయడం సంచలనం సృష్టించింది. దీనిపై ఆయన కూడా ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పార్టీకి సంబంధం లేని వ్యక్తుల పెత్తనం వల్లే గత ఎన్నికల్లో ఘోర పరాజయం మూటగట్టుకున్నామని, ఆ వ్యక్తులు మాత్రం కోట్లు కూడబెట్టుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులుగా ముదునూరి ప్రసాదరాజును నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. వైసిపి ఎంఎల్‌సిలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సైతం ఎక్కడా కానరావడం లేదు. ఆ పార్టీకి చెందిన కొయ్యే మోషేనురాజు ఒక్కరే శాసన మండలి ఛైర్మన్ బాధ్యతల్లో జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మరికొందరు మాజీ ఎంఎల్‌ఎలు, నేతలు వైసిపిని వీడనున్నట్లు ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. వీరిలో కొందరు టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకోగా మరికొందరు జనసేన వైపు మళ్లుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా రెండు జిల్లాల్లో వైసిపి తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

వంట నూనె ధరలు సలసలా కాగుతుండటంతో వంటింట్లో ధరల మంట రేగింది. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక గతంకన్నా సీట్లు తగ్గినా మిత్రపక్షాల అండతో దుందుడుకుగానే వ్యవహరిస్తున్నారనడానికి నూనె ధరల పెరుగుదలకు కారణమయ్యే చర్యలు చేపట్టడమే. దీన్ని కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు నూనె దిగుమతులపై సుంకం పెంచారని గొప్పగా ప్రచారం చేయడం గమనార్హం. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారి సమస్యలను కచ్చితంగా పరిష్కరించాల్సిందే. ఆ పేరుతో వంటనూనె వినియోగదారులపై భారం మోపడం దారుణమని, రైతులకు వినియోగదారులకు మధ్య ఉన్న సత్సంబంధాన్ని దెబ్బతీయడమేనని వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

- వివిఎస్‌వి.ప్రసాద్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పాఠశాలలో విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యుడు విజయకృష్ణ తనిఖీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ సూచించారు. మండలంలోని తిరుమలంపాలెం గ్రామంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య, తదితర వివరాలు ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటశాలలో వసతులను, వంటకాలను పరిశీలించారు. సిబ్బంది అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందిస్తే వారు ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటూ చదువులో రాణిస్తారనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిందన్నారు. ఈ పథకాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. అమలులో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో నీటి శుద్ధి యంత్ర సామగ్రి అన్నీ ఉన్నప్పటికీ వినియోగంలో లేకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలని సిబ్బందికి సూచించారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలిస్తున్న విజయకృష్ణ

చెరువు రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పొంగుటూరు - కన్నాయగూడెం మధ్య శ్రీరామకట్టు చెరువుకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. చెరువు ఆక్రమణ, రైతుల ఆవేదన శీర్షికతో ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు సర్వేయర్ ఆర్ఐ మణి దివ్య ఆధ్వర్యంలో సర్వేయర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, గ్రామ సెక్రటరీ రికార్డులు పరిశీలించారు. ఉదయం సుమారు పది గంటల నుంచి ఒంటి గంట వరకు దక్షిణం వైపుగా ఉన్న భూమిలో బౌండరీ నిర్ధారించారు. తూర్పు వైపు పొంత రోడ్డు, ఆ రోడ్డును ఆనుకుని ఉన్న ఆక్రమణలపై సోమవారం నివేదిక తయారుచేసి తహశీల్దారుకు అందిస్తామని చెప్పారు.

‘చింతలపూడి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి’

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చిట్టూరి ధర్మరాజు అన్నారు. పట్టణంలోని కొన్ని ఏరియాలో వీధి లైట్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం గమనించి సొంత ఖర్చులతో వీధి లైట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ, ఎంపీ సహకారంతో నగర పంచాయతీని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా విద్యార్థి ఎన్నికలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థి ఎన్నికలు విద్యార్థుల్లో నాయకత్వంతో పాటు సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి దోహదపడతాయని ఎంఇఒ బి.రామ్మూర్తి అన్నారు. స్థానిక శ్రీ సాయి సూర్య పాఠశాలలో కరస్పాండెంట్ కంచర్ల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ప్రతినిధి (ఎస్‌పిఎల్) ఎన్నికలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని పారదర్శకంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ముగిసిన హిందీ భాషా వారోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అపోలో విద్యాసంస్థలో హిందీ భాషా దినోత్సవ వారోత్సవాల ముగింపు సభను శనివారం నిర్వహించారు. అపోలో విద్యాసంస్థల చైర్ పర్సన్ ఆర్.శ్రీవిద్య మాట్లాడుతూ హిందీ భాషా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యాసంస్థల కరస్పాండెంట్, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూన్సీ, గౌరీ, మణి, రాధాకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

హిందీ భాషా వారోత్సవాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - మండవల్లి

దేశం గర్వించదగ్గ భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి శనివారం నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కమ్మరగూడెం గ్రామానికి చెందిన వైసిపి ప్రచార కార్యదర్శి గోక చిట్టిరాజు కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. చిట్టిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సొసైటీ సభ్యులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ పరపతి సంఘం ద్వారా ప్రతి సంఘ సభ్యుడిని ఆర్థికంగా ఆదుకుంటామని డిసిసిబి చీఫ్ మేనేజర్ తాతా వెంకటరావు ప్రసాద్ అన్నారు. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన మండవ వెంకటేశ్వరరావు, అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిన్ని నాగేష్‌లు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. వీరు వ్యవసాయ పరపతి సంఘం సొసైటీలో క్రాప్ లోను తీసుకోవడంతోపాటు, సంఘ సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చనిపోయినప్పుడు మట్టి ఖర్చుల నిమిత్తం ఇచ్చే రూ.పది వేల ఇరు కుటుంబాలకు కలిపి మొత్తం రూ.20 వేల శనివారం అందించారు.

పలుచోట్ల సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - భీమడోలు

సకాలంలో ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపడితే పంట నష్టం తగ్గి, దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు హబీబ్‌బాష తెలిపారు. భీమడోలు మండలంలో వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు ఉషా రాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి, సాంకేతిక వ్యవసాయ అధికారి పి.ఎన్.ప్రసూన ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సూరప్పగూడెం గ్రామం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఎలుకల నిర్మూలన మందును పంపిణీ చేశారు. అమరావతి కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన సంయుక్త సంచాలకులు పద్మజ వచ్చి పరిశీలించారు.

ముదినేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలపల్లి ఎడిఎ జి.వెంకటమణి పలు సూచనలు చేశారు.

పలుచోట్ల ‘స్వచ్ఛతా హి సేవ’

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు శనివారంతో ఆరో రోజుకు చేరాయని ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా సూరప్పగూడెంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. డ్వాక్రా మహిళలు పారిశుధ్య పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. పారిశుధ్య పనులపై డ్రైవ్ నిర్వహించారు. గ్రామపంచాయతీ సౌజన్యంతో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కిట్లను అందించారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీలో ఐదో రోజు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు, రక్షణ జాకెట్లు, గ్లౌజులు అందించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు.

ఉంగుటూరు : గోపీనాథపట్నంలో స్వచ్ఛతా హి సేవ్ భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు సర్పంచ్ విష్ణుమూర్తి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో పారిశుధ్యంపై అవగాహనా ర్యాలీ చేశారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో బోడిగూడెంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీమంతం చేశారు.

‘కల్తీ నెయ్యి నిందితులను శిక్షించాలి’

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి :తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి నిందితులను కఠినంగా శిక్షించాలని హిందూ భక్త సమాజం ఆధ్వర్యంలో గుడివాడ చిట్టిబాబు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ శ్యామలరావు తిరుపతి దేవస్థానంలో లడ్డూ తయారీ చేసే నెయ్యిలో జంతువుల నూనెలు ఉన్నాయని ప్రయోగశాల ధ్రువీకరించిందని చెప్పారు. ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నిజానిజాలు నిగ్గు తేల్చి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 26న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఏచూరి, ఆర్ఎస్‌ల మృతి తీరని లోటు

ప్రజాశక్తి - పోలవరం

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎంఎల్ఎ ఆర్ఎస్‌ల మృతి తీరని లోటని సిపిఎం నాయకులు అన్నారు. వారికి పోలవరం మండల కమిటీ శనివారం నివాళులర్పించింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడిన నాయకులు సీతారాం ఏచూరి, ఆర్ఎస్‌లు అని అన్నారు. ఇద్దరు నాయకుల మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బాలరాజు, బొరగం భూచంద్రరావు, మడివి చలపతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని పోలవరం ఎంఎల్ఎ బాలరాజు తెలిపారు. బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన నియోజక వర్గ స్థాయి, క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి అండర్-14, అండర్-17 విభాగాలకు 500 మంది వరకు క్రీడాకారులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ స్వామి తెలిపారు.

ముసునూరు : నియోజకవర్గ స్థాయి బాలికల ఆటల పోటీలను ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు హేమలత శనివారం ప్రారంభించారు. ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి, నూజివీడు మండలంలోని అండర్-14, అండర్-17 విభాగంలో ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

తెలుగు భాషాభివృద్ధికి గురజాడ కృషి

ప్రజాశక్తి - భీమడోలు

తెలుగు భాషాభివృద్ధికి గురజాడ వెంకట అప్పారావు చేసిన కృషి అభినందనీయమని అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మస్తాన్ అన్నారు. పాఠశాలలో శనివారం సాయంత్రం గురజాడ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గురజాడ రచనలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు షేక్ బషీరుద్దీన్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి షేక్ బషీరుద్దీన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని వివిఎస్ఎన్.కళాశాల యాజమాన్యం తెలిపింది. బర్రింకలగూడెంలో శనివారం ఎంపిక నిర్వహించారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం సిఐటియు కార్యాలయంలో ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల కమిటీ సమావేశం జి.మంగతాయారు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహ వ్యతిరేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, ఈ సమస్య నిరోధించడానికి అవగాహన, విద్య అవసరమన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.విశ్వేశ్వరావు మాట్లాడారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా శ్రీనివాస్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు స్థానిక ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో శనివారం యూనియన్ సంఘాల నేతలు, వివిధ శాఖల అధికారులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస్ ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అయనకు పలువురు ఉద్యోగులు, పుర ప్రముఖులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇఎన్‌సి ఆర్.సతీష్‌కుమార్, ఇరిగేషన్ ఇన్‌ఛార్జి ఎస్ఇ దేవ ప్రకాష్, రిటైర్డ్ ఎస్ఒ ఎంవి.కృష్ణారావు, ఎన్‌జిఒ జెఎసి నాయకులు ఆర్ఎస్.హరనాధ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు కందుల రమేష్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బకాయి సెస్‌లను చెల్లించాలి

భీమడోలు :గ్రంథాలయ సంస్థకు వివిధ శాఖల నుంచి రావాల్సిన బకాయి సెస్‌లను త్వరితగతిన చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు కోరారు. శనివారం భీమడోలు శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు పలు అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు.

రాయితీపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి

పిఎం సూర్య ఘర్ యోజన కింద తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన వంటి పథకాన్ని అందరూ స్వాగతించవల్సిందేనని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శనివారం ఎపిఇపి డిసిఎల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంబంధిత అవగాహన గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద రాయితీపై సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. సౌర విద్యుత్ శక్తిని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ యూనిట్లను ఏర్పాటు చేసుకోడానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు కూడా అందిస్తుందని తెలిపారు. సోలార్ రూఫ్ ఏర్పాటు కోసం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. www.pmsuryaghar.gov.in/apepdcl webite ద్వారా లేదా పిఎం సూర్య ఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ డి.పుష్పమణి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, ఎన్ఆర్ఇడిసి జిల్లా మేనేజర్ యు.హరీష్, డిఎల్‌సి సభ్యులు ఆలూరి రమేష్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, విద్యుత్ శాఖ ఎఇ జెపిబి నటరాజన్, డిఇ రాధాకృష్ణ, ఎడిఇలు అంబేద్కర్, కృష్ణరాజ, త్రివాస్, ఎఇ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయ సిబ్బందికి, విద్యార్థినులకు సూచించారు. అటువంటివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.నవీన్‌కుమార్, స్టేషన్ మహిళా కానిస్టేబుల్ మహతి, కళ్యాణి పాల్గొన్నారు.

చింతలపూడి : విద్యార్థులు ఏ సమస్య ఉన్నా నేరుగా తమను సంప్రదించవచ్చని సిఐ రవీంద్ర తెలిపారు. చింతలపూడిలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడిన ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు, ఎర్రగుంటపల్లి వార్డెన్ ఆకృత్యాలు చూస్తుంటే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు సిఐ రవీంద్ర, ఎస్ఐ కుటుంబారావు మండలంలోని నాగిరెడ్డిగూడెం బాలికల వసతి గృహానికి వెళ్లి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభంశుభం తెలియని చిన్నారులపై కామాంధుల కళ్లు పడుతున్నాయన్నారు. ఈ తప్పు జరగకుండా ఉండాలంటే మన పిల్లలకు ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచ్ అన్నది చెప్పాలన్నది ఉపాధ్యాయలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బ్రాహ్మనేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం కృషి

ప్రజాశక్తి - ముసునూరు

అందరికీ అందుబాటులో ఉంటూ అందరి సమస్యలను పరిష్కరించే, సమ మార్గంలో నడిచే పార్టీ సిపిఎం అని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని సిపిఎం కార్యాలయంలో శాఖ మహాసభ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 16 మంది కమిటీ సభ్యులతో నూతనంగా ఇరువురు సిపిఎం కార్యదర్శులుగా కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన ముసునూరుతో పాటు పలు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయించాలని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శివప్రసాద్, కంచర్ల శ్రీను, కంచర్ల దుర్గారావు, పోటురు శ్రీను, పిన్నిబోయిన శ్రీను, రాంబాబు, రెడ్డి తిరుపతిరావు, నాగరాజు, చెంగల శ్రీను, మధుబాబు, సిహెచ్.శ్రీను, వెంకటేశ్వరరావు, కొల్లి శ్రీను పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని మైసన్నగూడెంలో సిపిఎం శాఖ మహాసభ శాఖా సభ్యులు పిల్లి పోతురాజు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకరరావు పాల్గొన్నారు. ప్రారంభ సూచికగా సిపిఎం జెండాను పిల్లి పోతురాజు ఎగరవేశారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి జిల్లాల ఉద్యమ నిర్మాత ఆర్ఎస్ మృతికి సంతాపం తెలిపారు. జి.సూర్యకిరణ్ మూడేళ్ల నిర్మాణ నివేదిక ప్రవేశపెట్టారు. మహాసభలో శాఖ సభ్యులందరూ జి.సూర్యకిరణ్‌ను శాఖ కార్యదర్శిగా ఏవగ్రీకంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి వెంకట సుబ్బారావు, పులపాకుల వీర్రాజు, మద్దాల మధు, ఉండ్రాజువరుపు బక్కయ్య, చాబత్తుల రవి, పిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

కొల్లేరు వరదల వల్ల వేలాది ఎకరాల విస్తీర్ణంలో గల ఆక్వా ఉత్పత్తులను నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. భీమడోలులోని సిఐటియు కార్యాలయంలో శనివారం రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రొయ్యలు, చేపల ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరను ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం అధ్యక్షులు దాసరి జానకిరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల కార్యాలయంలో మండల రైతు సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం, పంటల బీమా, ఇన్‌పుట్ రాయితీ ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలుచోట్ల ‘ఇది మంచి ప్రభుత్వం’

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అందరికీ ఆమోదయోగ్యమైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏలూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఇతర నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఏడో డివిజన్ గుడిమెట్ల బసవరాజు సందులో కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు.

చింతలపూడి : మండలంలోని చార్లెస్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, పట్టణ అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరించేందుకు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు

ముసునూరు : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజుల్లో ప్రజలకు అందించిన పలు కార్యక్రమాలను టిడిపి గ్రామ నాయకులు తుమ్మల నాగేశ్వరరావు, గరికిముక్కు నాని వివరించారు. మండలంలోని వేల్పుచర్ల, గోపవరం పంచాయతీ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

భీమడోలు : భీమడోలు మండలంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. భీమడోలు గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ పద్మావతీదేవి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు, కూటమి నాయకులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కామవరపుకోట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమము ముమ్మరంగా సాగుతుందని టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ తెలిపారు. గుంటుపల్లి గ్రామ పంచాయతీలోని కోదండ రామనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళీరామకృష్ణ, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు పారేపల్లి రామారావు పాల్గొని మాట్లాడారు. ొత్తూరు, కాపుల బజార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ కామవరపుకోట టౌన్ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి వీరబాబు మాట్లాడారు.

టి.నరసాపురం : మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఎంపిడిఒ బిఎస్ఎల్.మంగాకుమారి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి వందరోజుల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న కరపత్రాలు, గోడ పత్రికలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసి అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలాభివృద్ధిపై దృష్టి సారించాలని నూతనంగా నియమితమైన మండల ప్రత్యేక అధికారి మహ్మద్ రజాఉల్ల మండల అధికారులకు ఆదేశాలిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి మండలాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా స్వచ్ఛత హి సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 అంశాలలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

DOCUMENT MISSING

As per the instruction of my client **Sri Mullapudi Rama Mohan**, S/o. M.K.V.V Chalam, R/o. Eluru, This publication is here with published as follows

On 21.08.2024 while my client was proceeding from his house at Satrampadu, to Xerox shop located at satrampadu, Eluru for getting Photostat of a document bearing No **.1239/2002** dated **14.08.2002** and it was observed that the said document was missing .

Therefore, if the said document was identified by any one , please return in to my client .

E.SRINIVASA BABU Advocates
Eluru , 9440188498

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప.గో.జిల్లా.

ఐ.పి.నెం. 7/2024

బిట్వీన్:
శ్రీ మద్దుల సత్య కిషోర్ S/o సూర్యప్రభాకరరావు, చింతలతోట, పాలకొల్లు, పాలకొల్లు మండలం. ...పిటీషనరు
మరియు
కడలి రాంబాబు మరియు 33 మంది వగైరా . ..రెస్పాండెంట్స్

పై నంబరు గల ఇన్సాల్వెన్సీ పిటిషన్లో పిటీషనరు తనకు గల బాకీలను తీర్చలేని స్థితులలో 34 మంది రెస్పాండెంట్స్ పై, డెటార్ ఇన్సాల్వెన్సీ పిటీషను దాఖలు చేసియున్నారు. మరియు ప్రొవిన్సియల్ ఇన్సాల్వెన్సీ ఆక్టు అండర్ సెక్షన్ 10, 13 ప్రకారము వగైరా రిలీఫ్స్ కోరుచూ దాఖలు చేసియున్నారు. దానిపై శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు పైన చూపించిన 34 మంది రెస్పాండెంట్లకు గాని, మరి ఏ ఇతర రుణదాతలకు గాని, ఎట్టి అభ్యంతరములు ఉన్నయెడల ది. 04-10-2024 ఉదయం 10.30 ని షములకు శ్రీకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఐ.పి. నందు అభ్యం తరములు తెలియజేసుకోవలెను. లేనియెడల పై పిటీషనును మీకు పరోక్షముగా తీర్మానించబడును. దరిమిలా వచ్చే ఆక్షేపణలు ఏమీ పిటీషనరును బైండ్ చేయవని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

స్థలం: నరసాపురం
తేది :20-09-2024

టోడపాటి నారాయణస్వామి నాయుడు
పిటీషనరు తరపు
అడ్వకేట్, నరసాపురం.
పశ్చిమ గోదావరి జిల్లా,
సెల్ : 9949640906

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.2 of 2019 in O.S.No.25 of 2015

బిట్వీన్:
అడ్డగళ్ళ విజయ కుమార్ ...పిటీషనరు /డి. హెచ్. ఆర్ /వాది
అండ్
నెల్లి భారతి ...రెస్పాండెంటు /జె.డి. ఆర్ /ప్రతివాది

పై నెంబరు వారంటు గ్రంధములో డి.హెచ్.ఆర్.కి రావలసిన డిక్రీ బాకీని, ఖర్చులు మరియు వడ్డీతో సహా రాబట్టుకొనుటకు గాను, జె.డి.ఆర్. స్వాధీనంలో గల ఇ.పి. షెడ్యూలు స్థిరాస్థిని **ది.03-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టు వారి ఎదుట వేలం పాట వేయబడును.** కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులు తెలుసుకొని వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

షెడ్యూలు ఆస్థి వివరం

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో చేరిన నరసాపురం పట్టణం, నరసాపురం మునిసిపల్ లిమిట్స్‌లోని రుస్తుంబాద, 28వ వార్డులోని, రి.స.నెం.136/5లో, డో.నెం.13-3-16 రున అసెస్మెంట్ నెం.5928రు గల చ॥గ॥218 గల స్థలమున్ను అందులోని తాటియాకుల ఇల్లు హద్దులు: **తూర్పు:** పంట బోదె. **పడమర:** ఉండ్రాజవరపు మరియమ్మ తాలూక ఆస్థి. **దక్షిణం:** కాలువ, పోరంబోకు. **ఉత్తరం:** శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం వారి ఆస్థి.

ఈ హద్దుల మధ్య చ॥గ॥218 గల స్థలమున్ను అందులోని తాటియాకుల ఇల్లున్ను సదరు ఇంటిని అంటియున్న యావత్తు గృహోపకరణములతో సహా వేలం కావలసియున్నది.

డి. హెచ్.ఆర్. విలువ : రూ.4,00,000/-
అమీనా విలువ : రూ.9,00,000/-

కటికరెడ్డి కరుణ్ కుమార్
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం
18-9-24. సెల్: 9441922459

ఆదర్శ రైతు చదలవాడ నారాయణరావు

సంతాప సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య

ప్రజాశక్తి - ముసునూరు

వెనుకబడిన అక్కిరెడ్డిగూడెం ప్రాంతంలో ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన ఆదర్శ రైతు, సిపిఐ నాయకుడు చదలవాడ నారాయణరావు అని సిపిఐ జిల్లా కార్యదర్శి మండవ కృష్ణ చైతన్య అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో శనివారం నిర్వహించిన నారాయణరావు సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు దిగ్గజాలు చండ్ర రాజేశ్వరరావు, దాసరి నాగభూషణం, చలసాని జగన్నాథరావు, కూచిపూడి లక్ష్మీనారాయణలతో కలిసి ఆయన పలు రైతాంగ, కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.జయబాబు సూచించారు. మండలంలోని మర్రిగూడెంలో ఆశ్రమ గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్లో విద్యార్థులకు శనివారం పోక్సో వంటి పలు చట్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని సూచించారు.

మోడల్ గ్రామంగా గొల్లగూడెం

ఉంగుటూరు : మండలంలో గొల్లగూడెం గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా గుర్తించి అభివృద్ధి పనులు చేసేందుకు రూ.1.50 కోట్లను ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు మంజూరు చేయించారని టిడిపి నాయకుడు వేములపల్లి తెలిపారు. రూ.90 లక్షలతో సిమెంటు రోడ్లు, రూ.60 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించి గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

O.S.No.182/2019

బిట్వీన్:
మామిడిశెట్టి రామకృష్ణ మరియు కట్టా కళావతి ...**Plaintiffs**
VS
మామిడిశెట్టి వేంకటేశ్వరరావు & 8 వగైరా ...**Defendants**

TO:
D-6: శ్రీమతి మామిడిశెట్టి నాగలక్ష్మి, అలియాస్ నీలిమ, తండ్రి: పాపారావు, పండితవిల్లూరు, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 6వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా సమనులు పంపించి నప్పటికిన్నీ అవి మీకు అమలు జరగనందున, ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావాలో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల **ది.24-09-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి, మీవాదన దాఖలు చేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షములో తదుపరి గ్రంధము జరుపబడును.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

జి.వి.సుబ్బారావు, M.Sc., B.L.,
అడ్వకేట్, వెలమగూడెం,
పాలకొల్లు. సెల్: 9849418841

PUBLIC NOTICE

Under the instructions of my client M/S. Shriram Finance Ltd., Aswaraopeta Branch Rep. by its Branch Manager it is Stated that Nali Gangaratnam, W/o. Nali Satyanarayana, 37 Years, Occ. House hold, R/o. Papidigudem Village, Utlapalli Grama Panchayath, Aswaraopet Mandal, Bhadradri Kothagudem District, is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 3 days form the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Thatties roofed house bearing Assessment No.1142019199 (Old H.No.13-16) in a plinth area of 390 Sq. Feet in the house site to an extent of 215 Sq. Yards or 180 Sq. Mts in R.S.No. 482-2B situated at Jangareddigudem Village and Mandal, West Godavari District, SRO lilmits of Jangareddigudem bounded by:
EAST: 5 Yards width Road left by Talari Venkanna and Others 31'-6". ***SOUTH:*** Place of Talari Seethaiah 60'. ***WEST:*** Place of Gullapudi Raja 33". ***NORTH:*** Place of Talari Srinu 60'.

Kothagudem,
Dt.21-09-2024.

P.GANESH BABU, ADVOCATE,
Kothagudem. Cell: 98492 46278

మండల ప్రజా పరిషత్ కార్యాలయము, భీమడోలు

A1/26/2024, తేదీ.19-09-2024

టెండరు నోటీసు ప్రకటన

ఏలూరు జిల్లా, భీమడోలు మండలము, పూళ్ళ గ్రామములో గల మండల ప్రజా పరిషత్, భీమడోలు వారి షాపింగ్ కాంప్లెక్స్ నందలి 5 షాపులకు ది.01-10-2024వ తేదీ నుండి 3 సంవత్సరములు అనగా ది.30-09-2027వ తేదీ వరకు (2024-27) గల కాలమునకు అద్దె ప్రాతిపదికన ఇచ్చుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డ్ టెండర్లు అదే రోజుఉదయం గం॥11:00ల నుండి మధ్యాహ్నం గం॥3:00ల వరకు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం॥4:00లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయము, భీమడోలు నందు తెరువబడును. మిగిలిన వివరములకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం భీమడోలు నందు కార్యాలయ పనివేళలలో సంప్రదించవలసినదిగా తెలియజేయడమైనది.

సం/- **మండల పరిషత్ అభివృద్ధి అధికారి**
మండల ప్రజా పరిషత్, భీమడోలు.